క్లుప్తంగా

అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు



కామారెడ్డి టౌన్ : బీజేపీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ముందు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్ మాట్లాడుతూ అమెరికా పర్యటనలో భారతదేశం, ప్రజాస్వామ్యంపై దేశ ప్రజలను అవమానించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. రాహుల్ గాంధీ వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్,అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్ ఉన్నారు.

వైద్యశిబిరాల నిర్వహణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని గోపాల్‌పేట, వెంకంపల్లి గ్రామాల్లో గురువారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఇరు గ్రామాల్లో 14 మందికి వైద్యపరీక్షలు చేశారు. వైద్యశిబిరాల్లో సూపర్‌వైజర్ సునంద, ఎంఎల్‌పీహెచ్‌లు అజయ్, దేవిదాస్, అపర్ణ, జ్యోతి, ఏఎన్‌ఎంలు మాణెమ్మ, వసంత తదితరులున్నారు.

కూలిన ఇల్లు పరిశీలన



కామారెడ్డి టౌన్ : మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు పాత రాజంపేట్‌లో కూలిన పెంకుటిల్లును గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. బాధితులు మల్లయ్య, కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదించి సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్ఐ నర్సింహారెడ్డి, కౌన్సిలర్ ఆకుల రూప తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు



బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్సీ వర్గీకరణ తీర్పును హర్షిస్తూ సంబురాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంబురాల్లో జోగోల్ల మోహన్, నల్లొల్ల సాయిలు, ఎర్రొల్ల బాలుతో పాటు గ్రామస్తులు శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులున్నారు.

పౌష్టికాహారం అందించాలి



నిజాంసాగర్(జుక్కల్) : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీడీవో గంగాధర్ సూచించారు. గురువారం మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. జీపీ కార్యదర్శి బలరాముడు, అంగన్‌వాడీ టీచర్ కమల తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖోకు క్రీడాకారులు



మాచారెడ్డి(కామారెడ్డి) : రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్ షిప్ పోటీలకు పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ 13, 14, 15వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పోటీలకు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గెరిగంటి ప్రణీత, ముదుగల వినోద్ ఎంపికైనట్లు హెచ్‌ఎం గోవర్ధన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమారెడ్డి, అనిల్, అతిక్ ఉల్ల, గ్రామస్తులు ఉన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



బీబీపేట : మండలంలోని కోనాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అక్షరాభ్యాసం, పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాలు నేర్పించారు. అలాగే అంగన్‌వాడీలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తూనే వారికి మంచి విద్య కూడా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ మంగ, టీచర్ మమత తదితరులు పాల్గొన్నారు.

గుట్టల్లో ఇసుక అక్రమ డంపులు

- రాత్రి వేళలో లారీల్లో తరలింపు
- ఎట్టకేలకు సీజ్ చేసిన అధికారులు

బిచ్కుంద(జుక్కల్) : ఇసుక రవాణాను నియంత్రించడంలో అధికార యంత్రాగం పూర్తిగా విఫలమవుతోందని మండలవాసులు పేర్కొంటున్నారు. మండలంలోని ఖద్గాం, శెట్లూర్, హజ్గుల్, పుల్కల్ నాలుగు గ్రామాల పరిధిలో మంజీర నుంచి ప్రతిరోజు వందల ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. గోపన్‌పల్లి, హజ్గుల్, ఖద్గాం, మద్నూర్ మండలం సుల్తాన్‌పేట్, రుషేగాం గ్రామాల శివారు గుట్టలలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను డంపు చేస్తున్నారు. రాత్రి సమయంలో లారీలలో నింపి జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, కర్ణాటక, మహారాష్ట్ర బిదర్, ఔరాద్, హనెగాం ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో గ్రామంలో 40 నుంచి 70 ట్రాక్టర్లు ఉన్నాయి. అర్ధరాత్రి వందల ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక తరలించి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. బిచ్కుంద, శెట్లూర్, పుల్కల్, హజ్గుల్‌లో కొందరు ఇసుక ముఠాగా ఏర్పడి అధికారులు అడిగినంత ముటజెప్పి అవసరమున్న చోట నాయకులు పేర్లు చెప్పి అడ్డూఅదుపు లేకుండా యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. మండల అధికారులు వందల ట్రాక్టర్లను వదిలేసి డబ్బులు ఇవ్వని డంపులను సీజ్ చేస్తున్నారు. రెండు మూడు ట్రాక్టర్లు పట్టుకొని జరిమానా విధించి మమ అనిపిస్తున్నారు.

వీఆర్‌ఏలే వసూల్ రాజాలు..

ఇసుక రవాణా జరగకుండా రాత్రి మంజీరా వద్ద డ్యూటీలో ఉన్న వీఆర్‌ఏలు వసూల్ రాజాలుగా మారారు. వీఆర్‌ఏలు కొందరు వయస్సు పైబడిందని విధులకు రావడం లేదు. వారి స్థానంలో వారి కొడుకులను అధికారులు బినామీ వీఆర్‌ఏగా నియమించుకొని రాత్రి మంజీరా వద్ద డ్యూటీలు వేసి బినామీలతో అక్రమ వసూళ్లు చేయిస్తున్నారని ఇదంతా అధికారుల కనుసన్నల్లో వసూళ్లు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రతిరోజు ఎన్ని ట్రాక్టర్లు వెళ్తున్నాయి.. లెక్కచూసుకొని వసూల్ చేస్తున్నారు. మంజీరాలో వరద నీరు ఉందని ఇసుక తీయడం లేదని ఉన్నతాధికారులను మండల అధికారులు నమ్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఇసుక రవాణాను అరికట్టాలని, వేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు మొత్తుకుంటున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారు.

గోపన్‌పల్లి శివారులో..

మండలంలోని గోపన్‌పల్లి శివారులో ఇసుక అక్రమ డంపులు ఉన్నాయని రెవెన్యూ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేశారు. డంపులను సీజ్ చేయకుంటే ఇసుక ఫొటోలు కలెక్టర్ పంపించి ఫిర్యాదు చేస్తామని ప్రజలు హెచ్చరించడంతో ఒక్కసారిగా రెవెన్యూ అధికారుల్లో చలనం వచ్చింది. గురువారం పరుగులు తీసి గోపన్‌పల్లి శివారులో ఉన్న 18 ఇసుక డంపులను సీజ్ చేశారు. జిల్లా అధికారులు స్పందించి ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటు చేసి రాత్రి సమయంలో దాడులు చేసి అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గోపన్‌పల్లి గుట్టలో సీజ్ చేసిన ఇసుక డంప్‌లు

సన్మానాలు..

విద్యుత్ శాఖ డీఈలకు సన్మానం



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయానికి నూతనంగా బదిలీపై వచ్చిన డీఈలు ప్రభాకర్, కళ్యాణ్ చక్రవర్తిలను గురువారం డివిజనల్ కార్యాలయంలో జిల్లా రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాయాగౌడ్, డివిజన్ అధ్యక్షుడు రఘుకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మం, జీవన్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుకు..



నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఫార్మసిస్ట్ అనిత బదిలీ కావడంతో గురువారం ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, వైద్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యుడు రోహిత్‌కుమార్, ఆరోగ్య కార్యకర్తలు పుష్ప, సవిత, సునిత, సుజాత తదితరులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు..



బిచ్కుంద(జుక్కల్) : మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. మండలంలోని 14 మంది ఉత్తమ టీచర్లను ఎంపిక చేసి పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుషాల్ చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాములు నాయక్, సంఘాల నాయకులు శ్రీనివాస్, ఇర్షాద్‌అలీ, శివకాంత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో..



మాచారెడ్డి(కామారెడ్డి) : మాచారెడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సరిత, విజయకు గురువారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అశోక్ కుమార్, ఉపాధ్యాయులు జ్యోతి, సౌజన్య ఉన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమిలేయర్ అమలు చేయాలి



భిక్కనూరు : ఎస్సీ రిజర్వేషన్‌లలో క్రిమిలేయర్ విధానం అమలు చేస్తేనే దళిత కులాలన్నింటికి న్యాయం జరుగుతుందని రాష్ట్ర దళిత వికాస సమితి అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ అన్నారు. గురువారం భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామానికి చేరుకున్న పాదయాత్రలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1వ తేదిన ఆదిలాబాద్ జిల్లాలో క్రిమిలేయన్ విధానం అమలు చేయాలని పాదయాత్రను ప్రారంభించామని ఈ పాదయాత్ర అలంపూర్ వరకు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత వికాస సమితి జిల్లా అధ్యక్షుడు లింగం, నాయకులు జీడి శంకర్, కర్రోళ్ల ప్రశాంత్ ఉన్నారు.

ఏచూరి మరణం తీరని లోటు

కామారెడ్డి టౌన్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మృతి పట్ల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేసి నివాళులు అర్పించారు.

సేంద్రియ పద్ధతిలోనే పంటలు పండించాలి

బీబీపేట: సేంద్రియ పద్ధతిలోనే కూరగాయలతో పాటు పంటలను పండించాలని టీడీఎఫ్ వనిత చేయూత ఇండియా అధ్యక్షురాలు తిమ్మయ్యగారి వాణి అన్నారు. గురువారం జనగామ గ్రామంలో మన ఇల్లు, మన కూరగాయలు-తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం జై కిసాన్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలో మహిళా సంఘాల సభ్యులందరికీ సేంద్రియ పద్ధతిలో కూరగాయలు ఎలా పండించాలనే విషయమై అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తున్న రైతు సిద్దిరాములు చేత అవగాహన కల్పించారు. జానపద గాయకురాలు దివ్య, నవీన్ వారి జానపద గేయాలతో చెట్లను పెంచడం యొక్క ప్రాముఖ్యతని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమానికి హాజరైన రైతులు

ఆధ్యాత్మికం

ఘనంగా లలితాసహస్ర నామ పారాయణం



భిక్కనూరు : మండల కేంద్రంలోని నగరేశ్వరాలయంలో ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో లలితాసహస్రనామ కార్యాక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహ మండపం వద్ద సామూహిక లలితాదేవి సహస్రపారాయణంను ఆలపించారు. ఈ సందర్భంగా మహిళలు భజన నిర్వహించారు. అన్నదానం చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



మాచారెడ్డి(కామారెడ్డి) : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహాస్వామి ఆలయ అభివృద్ధి కోసం కామారెడ్డి మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన కేస్కర్ బలరామన్ రూ. 42 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతకు స్వామి వారి చిత్ర పటాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్, సిబ్బంది సంతోష్ ఉన్నారు.

నటేశ్వర శర్మకు ఘననివాళి



భిక్కనూరు : ప్రఖ్యాత కవి, అష్టవధాని దివంగత ఆయాచితం నటేశ్వరశర్మ సంస్మరణ సభ భిక్కనూరులో గురువారం జరిగింది. సమావేశంలో పలువురు తెలుగు భాష పండితులు శర్మ అందించిన సాహిత్య సేవల్ని స్మరించుకున్నారు. అయన పద్య పఠనం, జంట అవధాన ప్రక్రియలను చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నటేశ్వర శర్మ సోదరి వాణిశ్రీ, అన్నగారితో అనుబంధం, అతని కవితల్లో మాధుర్యం తదితర విషయాలను పంచుకున్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ పార్టీ



బాన్సువాడ : బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీ ఉల్లాసంగా..ఉత్సాహంగా కొనసాగింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా నోడల్ అధికారి సలాం మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్యే కీలకమన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరింపజేశాయి. ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ రఘు తదితరులున్నారు.

అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోండి



ఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఫొటోగ్రాఫర్లు

భిక్కనూరు : మండల కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు నిర్మించిన అక్రమకట్టడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భిక్కనూరు మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం భిక్కనూరు జీపీ ఈవో మహేశ్‌గౌడ్‌తో పాటు ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతిపత్రాలను అందజేశారు. సదరు వ్యక్తులు తమ సంఘ సభ్యులు శ్రావణ్‌కుమార్ ఇంటి పక్కన అక్రమ కట్టడాన్ని నిర్మించారని దీంతో శ్రావణ్‌కుమార్ మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు బత్తుల భిక్షపతి, ప్రతినిదులు ఆసం సిద్ధరాములు, శ్రీనివాసచారి తదితరులున్నారు.

స్తంభించిన మీసేవ సర్వీస్‌లు

- సర్వర్ సమస్యతో ఇబ్బంది
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

రామారెడ్డి : సర్వర్ సమస్యతో మీసేవ సేవలు స్తంభించడంతో జిల్లావ్యాప్తంగా ప్రజలు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ రకాలుగా సేవలందించే మీ సేవలు మూడు రోజులుగా సర్వర్ సమస్య తలెత్తడంతో సేవలు స్తంభించిపోయాయి. విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం వివిధ సర్టిఫికెట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేస్తున్న తరుణంలో మీసేవ సేవలు స్తంభించుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వివిధ పనుల నిమిత్తం మీ సేవలో దరఖాస్తులు చేసుకునేవారు కూడా సర్వర్ సమస్యతో మీ సేవల చుట్టూ తిరిగి ఇంటిముఖం పడుతున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 146 మీ సేవలో నిత్యం ప్రజలు వేల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవడం సర్వసాధారణం. సర్వర్ సమస్యతో జిల్లావ్యాప్తంగా మీసేవలో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో వివిధ పోటీ పరీక్షలు ఇతర దరఖాస్తులు చేసుకునేవారు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించి మీ సేవలను అందుబాటులోకి తేవాలని విద్యార్థులు ప్రజలు కోరుతున్నారు. మీసేవలో సర్వర్ సమస్య రాష్ట్రవ్యాప్తంగా తలెత్తినట్లు తెలుస్తోంది. దీనిపై మీసేవ ఈ జిల్లా మెనేజర్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా స్పందంచలేదు.



రామారెడ్డిలో మీసేవ కేంద్రానికి వచ్చిన విద్యార్థులు

మెట్ల బావి పనులు వేగంగా చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావి పునరుద్ధరణ పనులు గురువారం డీఆర్‌డీవో సురేందర్ పరిశీలించారు. బావి పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పనుల్లో వేగం పెంచాలన్నారు. బావి చుట్టూ కంచె, చుట్టూ మొక్కలు, నాలుగు వైపులా ఐమాక్స్ లైట్లు, కామారెడ్డి ఎల్లారెడ్డి రోడ్డు నుంచి బావి వరకు రోడ్డు వేయిస్తున్నట్లు తెలిపారు. పర్యాటకుల సందర్శన కోసం అన్ని హంగులతో సిద్ధం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఎంపీడీవో నరేష్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



బావి పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

న్యాస్ పరీక్షకు సంసిద్ధం చేయాలి



మాచారెడ్డి(కామారెడ్డి) : రాబోయే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని మాచారెడ్డి ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్ సూచించారు. గురువారం మాచారెడ్డి ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నిర్వహించిన న్యాస్ పరీక్ష పై సమీక్షా నిర్వహించి వచ్చే రెండు న్యాస్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్ లింగారెడ్డి, ఆయా పాఠశాలలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులు, సీఆర్పీ సంజీవ్ ఉన్నారు.

వసతి గృహాన్ని లింగంపేటకు తరలించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలానికి సంబంధించిన ఎస్సీ బాలికల గురుకుల విద్యాలయాన్ని కామారెడ్డి నుంచి లింగంపేట మండల కేంద్రానికి తరలించాని అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం నాయకులు లింగంపేటలో ఓ ప్రైవేటు భవనాన్ని పరిశీలించారు. వసతిగృహాన్ని వెంటనే అన్ని సౌకర్యాలున్న లింగంపేట భవనంలోకి మార్చాలని వారు కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు ముదాం సాయిలు, భూపతి, లెగ్గల రాజు తదితరులున్నారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాట్లను గురువారం ఎల్లారెడ్డి సీఐ రవీందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శోభాయాత్ర నిర్వహించే రోడ్లు, వీధుల్లో ఇరువైపులా వాహనాలు వెళ్లడానికి అనుకూలంగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఇరుకుగా ఉన్న ప్రదేశంలో వాహనాలు వెళ్లడానికి గుంతలు, ఎత్తువంపులు ఉన్నవి సరిచేయాలని సూచించారు. అలాగే చెరువులు, పెద్దవాగు పరిసరాలను పరిశీలించారు. వీధిదీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సై అరుణ్ కుమార్, ఏఎస్సై ప్రకాష్‌నాయక్, మండల పరిషత్ అధికారులు, జీపీ సిబ్బంది ఉన్నారు.



పెద్దవాగును పరిశీలిస్తున్న సీఐ రవీందర్

కష్టపడ్డవారికే పార్టీలో గుర్తింపు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి మంచి గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి మండలంలో చందాపూర్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి నాయకులు,కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు వివరిస్తే ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు వివరించి పరిష్కరిస్తామన్నారు. మార్కెట్‌కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన (చిట్యాల)జక్కుల రాజిరెడ్డిని సన్మానించారు. నాయకులు సంజీవులు, నరేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, శ్యాంరావు తదితరులున్నారు.



రాజిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంక్షిప్తం

పారిశుధ్యం లోపించకుండా చూడాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. గురువారం మండలంలోని సోమర్యాగడితండా జీపీని ఆయన పరిశీలించారు. తండాలో అన్ని కాలనీలను తిరిగి పర్యవేక్షించారు. జీపీ కార్యదర్శి తదితరులున్నారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ..

మాచారెడ్డి(కామారెడ్డి) : మండలంలోని లచ్చాపేట ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న వంద మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన అల్లం పద్మ ఆమె భర్త బాబు జ్ఞాపకార్థం మధ్యాహ్న భోజన ప్లేట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి దాతను అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బూస శ్రీనివాస్, జయరాం శర్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు పీఎంపీ, ఆర్‌ఎంపీల సమావేశం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని పీఎంపీ, ఆర్‌ఎంపీల అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంతోష్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మా తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గల పీఎంపీ, ఆర్‌ఎంపీలు విధిగా హాజరు కావాలని వారు కోరారు.

పలువురికి గంప గోవర్ధన్ పరామర్శ

భిక్కనూరు : మండలంలోని రెండు గ్రామాల్లోని బీఆర్‌ఎస్ కుటుంబాలను మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గురువారం పరామర్శించారు. తిప్పాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు వీడీసీ ఉపాధ్యక్షుడైన ఎన్గు భాస్కర్‌రెడ్డి కుటుంబాన్ని నాగార్తి హంసవ్వ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబాలకు రూ. 10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అలాగే రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన చేపూరి రమేష్‌ను పరామర్శించి ఆయనకు రూ.10 వేల ఆర్థికసహాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నేతలు అందే మహేందర్‌రెడ్డి, ద్యావర సాయిరెడ్డి, వంగేటి చిన్న నర్సరెడ్డి, నాగార్తి భూంరెడ్డి, అనంత్‌గౌడ్,పాల రాంచంద్రం, మద్ది ప్రమోద్‌రెడ్డి,తక్కళ్ల మదుసూధన్‌రెడ్డి,పైతరి స్వామిలు ఉన్నారు.

పంటల పరిశీలన



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయాధికారితో పాటు విస్తీర్ణాధికారులు వరి, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పంటలకు ఆశిస్తున్న చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.మండల వ్యవసాయాధికారి ప్రజా పతి, ఏఈవోలు పాల్గొన్నారు.

సివిల్‌రైట్స్‌పై అవగాహన కల్పించాలి



భిక్కనూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో సివిల్‌రైట్స్ అవగాహన సదస్సులు నిర్వహించాలని భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌కు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మణ్, శంకర్ గురువారం వినతిపత్రంను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు సాయిలు, రామస్వామిలు పాల్గొన్నారు.